సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



శోభనాచాల క్షేత్రంలో సందడి

ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రథసప్తమి కావడంతో భక్తులు పోటెత్తారు.

IIలో ▸



అభివృద్ధి పరుగులు

భీమవరం పట్టణంలో సుమారు రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. 52 కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించారు.

IIలో ▸



కమిటీలను ఏర్పాటు చేయాలి

మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రదేశాల్లో అంతరంగిక కమిటీలను ఏర్పాటుచేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సూచించారు.

IIలో ▸

న్యూస్‌రీల్

రూ.23 లక్షల సీఎం సహాయనిధి అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడికి సీఎం సహాయ నిధి బాసటగా నిలిచింది. భీమడోలు మండలం పాతూరుకు చెందిన సూర్యనందన్ బ్లడ్ క్యానర్‌తో బాధ పడుతున్నాడు. ఈ విషయం గతేడాది డిసెంబర్‌లో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి రాగా వెంటనే ఆయన స్పందించి సీఎం సహాయ నిధికి సిఫార్సు చేశారు. దీంతో మొదటి విడతగా రూ.10 లక్షలు మంజూరు కాగా సూర్యనందన్‌కు హైదరాబాద్‌లో రెండు నెలలపాటు వైద్యం చేయించారు. అయితే పూర్తిస్థాయిలో వైద్యానికి మరో రూ.13 లక్షల అవసరమవ్వగా.. ఈ మొత్తం కూడా అందించేందుకు ఎమ్మెల్యే వాసుబాబు కృషిచేశారు. రెండో విడత మంజూరైన రూ.13 లక్షల చెక్కును ఎమ్మెల్యే వాసుబాబు బాలుడు తల్లి పావనికుమారికి అందజేశారు. ఈ మొత్తంతో తన కుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారతాడని, ఇదంతా సీఎం జగన్ చలవేనని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటానని అన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో

భీమవరం (ప్రకాశంచౌక్): సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఉద్యోగుల గ్రీవెన్స్ చక్కని వేదిక అని, సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్‌లో భాగంగా పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు కార్యాలయంలో, వ్యక్తిగతంగా ఇబ్బందులు ఉంటే గ్రీవెన్స్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఉద్యోగులు సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలపై ప్రతినెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఐదు దరఖాస్తులు అందాయన్నారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, కలెక్టరేట్ ఏఓ పీహెచ్‌జీఆర్ పాపారావు పాల్గొన్నారు.

విస్తృతంగా ఆధార్ సేవలందించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఆర్వో

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు, మార్పులు సేవలను ప్రజలకు విస్తృతంగా అందించాలని ఇన్చార్జి డీఆర్వో బి.శివనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు ఆధార్ నమోదుపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఆర్వో మాట్లాడుతూ పథకాల అమలుకు ఆధార్ కార్డు మూలమని, దీని దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నెలకొల్పిందన్నారు. ఆధార్ నమోదు, తప్పులు సరిచేయడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సందేహాలను ఆధార్ స్టేట్ కో–ఆర్డినేటర్ వి.సుందరం, సహాయ సంచాలకులు బి.బాలు ప్రసాద్ నివృత్తి చేశారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

19న పదోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో ఈనెల 19న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల్లోని ప్రధానోపాధ్యాయులు గ్రేడ్–2 సహాయ ఉపాధ్యాయుల ఖాళీ పోస్టుల పదోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తామని ఐటీడీఏ ఏపీఓ, ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే ఎస్‌జీటీలు, సమాన ఉపాధ్యాయుల తుది సీనియార్టీ జాబితాను విడుదల చేశామని, వీటిపై ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటలకు సమన్వయ సమావేశం నిర్వహిస్తామని, 4 గంటల నుంచి పదోన్నతులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం

నిరుద్యోగులకు వరం

- సచివాలయ వ్యవస్థ ద్వారా వేలాది మందికి కొలువులు
- జాబ్‌మేళాలు, స్కిల్ సెంటర్ల ద్వారా ప్రైవేట్ ఉద్యోగాలు
- ఉపాధ్యాయ నియామకాలకు తాజాగా డీఎస్సీ నోటిఫికేషన్
- ఉమ్మడి పశ్చిమలో 306 పోస్టుల భర్తీకి చర్యలు



తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసి రాష్ట్రంలో లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. సచివాలయాలకు అనుబంధంగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి మరిన్ని లక్షల మందికి ఉపాధి కల్పించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వివిధ సాంకేతిక విభాగాల్లో శిక్షణ ఇవ్వడం, శిక్షణ పొందిన వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్ మేళాలు ఏర్పాటుచేసి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సచివాలయ వ్యవస్థ ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. అలాగే స్కిల్‌హబ్‌లు, జాబ్‌మేళాల ద్వారా సుమారు 15 వేల మందికి వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించారు. తాజాగా ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.

ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలు

ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్న సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు యూనిఫాం, షూ, డిక్షనరీ వంటి వినూత్న చర్యలతో పాటు ప్రధానంగా మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలు మంజూరు చేసి సర్కారీ బడుల రూపురేఖలు మారుస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసి చూపించారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేసి వారికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు కాగా గత ప్రభుత్వాలు పేరుకే డీఎస్సీలు నిర్వహించి ఉద్యోగాల భర్తీ చేయకుండా మోసం చేస్తే.. అభ్యర్థులు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారు. వీరి కలను నెరవేర్చేలా 1998 డీఎస్సీలో అర్హులైన 221 మందికి, 2008 డీఎస్సీలో అర్హులైన 180 మందికి సీఎం జగన్ ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

తాజాగా 306 పోస్టులతో.. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 306 పోస్టులు ఉన్నాయి. వాటిలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో స్పెషల్ గ్రేడ్ టీచర్లు 88, గిరిజన ప్రాంతాల్లో 14 , స్కూల్ అసిస్టెంట్లు 140, గిరిజన ఉపాధ్యాయులు 4, ఏపీటీడబ్ల్యూలో ఒకటి, బీసీ సంక్షేమ శాఖ ద్వారా 6, ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 31, ఏపీ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 13, ఏపీఆర్ఈఐఎస్ ద్వారా 9 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో వివిధ సంక్షేమ శాఖల ద్వారా 78 పోస్టులు, పాఠశాల విద్యాశాఖ ద్వారా 288 పోస్టులు భర్తీ చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ ద్వారా భర్తీ చేయనున్న పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 19, స్కూల్ అసిస్టెంట్ హిందీ 31, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 26, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 18, స్కూల్ అసిస్టెంట్ పీఎస్ 6, స్కూల్ అసిస్టెంట్ బీఎస్ 7, స్కూల్ అసిస్టెంట్ ఎస్ఎస్ 1, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 32, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 88 ఉన్నాయి.

ప్రభుత్వ విద్య మరింత బలోపేతం



ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి ముఖ్యమంత్రి తీసుకున్న చొరవ అభినందనీయం. దీంతో ప్రభుత్వ విద్యారంగం మరింత బలోపేతం అవుతుంది. అలాగే రాష్ట్రంలో 6 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకం జరిగితే ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులపై పనిఒత్తిడి తగ్గి వారు బోధనపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుంది. డీఎస్సీ–2024 ప్రకటనను డెమోక్రటిక్ పీఆర్‌టీయూ పక్షాన స్వాగతిస్తున్నాం.

– పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డెమోక్రటిక్ పీఆర్‌టీయూ

సీఎం జగన్‌తోనే ఉద్యోగాల భర్తీ



రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వగలిగే సత్తా ఒక్క ముఖ్యమంత్రి జగన్‌కే ఉంది. గత ప్రభుత్వాలు నిర్వహించిన డీఎస్సీలకు సంబంధించిన ఉద్యోగాలను కూడా ముఖ్యమంత్రి జగనే భర్తీ చేసి ఆయా కుటుంబాల్లో ఆనందం నింపారు. ప్రస్తుత డీఎస్సీతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 3 వందల మందికి పైగా ఉద్యోగాలు పొందనున్నారు. డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న వారికి ఇది తీపికబురు.

– గెద్దం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆరిమిల్లి ఫ్లెక్సీ షో

తణుకులో టీడీపీ చిల్లర రాజకీయాలు



మున్సిపల్ కార్యాలయంలో బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి, టీడీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తణుకులో ఫ్లెక్సీల వివాదంతో చిచ్చు రగల్చడానికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఫ్లెక్సీ నిరసన షో ఫ్లాప్‌షోగా మారింది. పట్టణంలో అధికార పార్టీ ఫ్లెక్సీలు తొలగించాలని గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఆయన చేసిన హడావుడిని ప్రజలు పట్టించుకోలేదు. పట్టణంలోని నరేంద్ర సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు చిన్నపాటి ప్రమాదాలు జరగడంతో ఆరిమిల్లి కటౌట్, ఫ్లెక్సీలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. దీంతో రాత్రి 11 గంటలకు ఆరిమిల్లి అక్కడకు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి పట్టణంలోని అన్ని ప్రధాన సెంటర్లలో వైఎస్సార్‌సీపీతో పాటు టీడీపీ ఫ్లెక్సీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కేవలం నరేంద్ర సెంటర్‌లోని కటౌట్, ఫ్లెక్సీలను మాత్రమే అధికారులు తొలగించగా దీనికి ఆరిమిల్లి రాజకీయ రంగు అద్దారు.

నిరసన హైడ్రామా : శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరిమిల్లి మున్సిపల్ కార్యాలయంలో బైఠాయించి నిరసన డ్రామాకు తెరతీశారు. నరేంద్ర సెంటర్‌లో ప్రజలకు ఇబ్బంది కారణంగానే ఫ్లెక్సీలు తొలగించామని, పట్టణంలో మరెక్కడా తొలగించలేదని పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజనీరింగ్ అధికారులు సర్దిచెప్పినా ఆయన వినలేదు. సాయంత్రం వరకు అక్కడే ఉండి కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి నిరసన ముగించారు.

శ్రీవారి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంపై స్వామివారు



చంద్రప్రభ వాహనంపై పురవీధులకు పయనం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు క్షేత్ర పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు విశేష పూజలు జరిపారు. అనంతరం వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. అశ్వ, గజ సేవల నడుమ జరిగిన వేడుక భక్తులకు కనువిందు చేసింది. అలాగే రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో తిరువీధుల్లో ఊరేగారు. అడుగడుగునా భక్తులు నీరాజనాలు అర్పించారు.

సూర్యదేవా నమోస్తుతే

ఘనంగా రథసప్తమి వేడుకలు



తణుకులో సూర్య దేవాలయం వద్ద భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రథసప్తమి సందర్భంగా తణుకులో సూర్య దేవాలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామున నుంచే భక్తుల రాక మొదలైంది. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. దేవదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఉషా, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణస్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. తణుకుకు చెందిన పెన్మెత్స త్రిమూర్తుల సీతారామచంద్రరాజు దంపతుల ఆర్థిక సాయంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. సుమారు 60 వేల మంది స్వామిని దర్శించినట్టు ఆలయ ఈఓ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. తణుకు సీఐ నాగరాజు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మంత్రి కారుమూరి పూజలు

ఆలయంలో సూర్యభగవానుడిని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. మంత్రి కారుమూరి ఆలయంలో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులందరికీ సూర్యభగవానుడు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మరింత శక్తిని ప్రసాదించి రాష్ట్ర ప్రజలందరికీ మంచి చేసేలా దీవించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రేలంగి రాంబాబు, గెద్దాడ శ్రీకాంత్, వై.రామకృష్ణ, కర్రి గంగాధర అప్పారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా వేడుకలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్థానిక కోడిగట్టు సర్వోదయపురం వద్ద సూర్యనారాయణస్వామి ఆలయంలో నుదురుమాటి శ్రీనివాస శర్మ బ్రహ్మత్వంలో కామిశెట్టి హీరాగాంధీ, అరుణాదేవి దంపతులచే స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని జరిపించారు.



పాలకొల్లులో సూర్యభగవానుడికి పూజలు

ఉపాధ్యాయులకు తాఖీదులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు డీఈఓగా ఎస్.అబ్రహం బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా జిల్లాలోని ఏలూరు, భీమడోలు మండలాల్లోని పలు పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఏలూరు మండలంలోని ఆగడాలలంక జెడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల, చెట్టున్నపాడు ప్రాథమిక పాఠశాల, కొక్కిరాయిలంక ప్రాథమిక పాఠశాల, గుడివాకలంక జెడ్పీ హైస్కూళ్లను పరిశీలించారు. ఆగడాలలంక, గుడివాకలంకల్లో ట్యాబ్‌ల వినియోగం అతి తక్కువగా ఉండటం, ఇంటి వద్ద నుంచి విద్యార్థులు ట్యాబులు తీసుకు రాకపోవడాన్ని గుర్తించి సదరు ఉపాధ్యాయులకు తాఖీదులు జారీ చేశారు. అలాగే గుడివాకలంక హైస్కూల్‌లో నోట్‌బుక్స్ దిద్దని ఇంగ్లిష్, గణితం ఉపాధ్యాయులకు సైతం నోటీసులు ఇచ్చారు. మిగిలిన ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందిని సర్వంసిద్ధం చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. మొత్తం 1,461 పోలింగ్ కేంద్రాల వద్ద వసతుల కల్పన పూర్తయ్యిందన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఈనెలలో పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో 80 వేల ఎపిక్ కార్డులను ఓటర్లకు పంపిణీ చేశామని, మరో 1,05,027 కార్డులను ప్రింటింగ్‌కు ఇచ్చామని, వాటిని కూడా త్వరలో ఓటర్లకు పంపిణీ చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణకు సుమారు 3 వేల మంది సిబ్బంది కొరత ఉందన్నారు. సీఏపీఎఫ్, ఇతర విభాగాల నుంచి తీసుకోవడానికి చర్యలు తీసుకున్నామన్నారు. బైండోవర్ కేసులు, చెక్‌పోస్టులను గుర్తించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

చేరువగా పోలీసు స్పందన

- సబ్ డివిజన్ల పరిధిలో నిర్వహణ
- ప్రజల చెంతకే వచ్చి అర్జీల స్వీకరణ
- ఎస్పీ అజిత వేజెండ్ల ప్రత్యేక చొరవ



నరసాపురంలో వృద్ధురాలి వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ అజిత వేజెండ్ల

సాక్షి, భీమవరం: జిల్లాస్థాయి పోలీసు స్పందన కార్యక్రమం నిర్వహణలో తనదైన ముద్ర వేస్తున్నారు నూతన ఎస్పీ అజిత వేజెండ్ల. గతంలో జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సబ్ డివిజన్ కార్యాలయాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటుచేయడం ద్వారా ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల సత్వర పరిష్కారానికి అక్కడికక్కడే ఆమె చర్యలు తీసుకుంటున్నారు.

మూడు సబ్ డివిజన్ల పరిధిలో..

జిల్లాల పునర్విభజన అనంతరం పోలీస్ శాఖకు సంబంధించి జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో 13 సర్కిల్, 26 పోలీస్‌స్టేషన్లు, మూడు ట్రాఫిక్, ఒక దిశ పోలీస్‌స్టేషన్ ఉన్నాయి. ప్రతి సోమవారం ఆయా స్టేషన్ల వద్ద స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం మొదట్లో భీమవరం సమీపంలోని చిన అమీరం ఎస్పీ కార్యాలయం వద్ద నిర్వహించేవారు. వినతులు ఇచ్చే వారికి ఇది దూరాభారంగా ఉండటంతో ప్రజల సౌలభ్యం కోసం గత ఎస్పీ యు.రవిప్రకాష్ భీమవరంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు.

మరింత చేరువగా..

జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అజిత వేజెండ్ల జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి వారానికి ఒక సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే భీమవరం సబ్ డివిజన్‌కు సంబంధించి భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, నరసాపురం సబ్ డివిజన్‌కు సంబంధించి నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించారు. వినతులు ఇచ్చేందుకు వచ్చిన వృద్ధుల చెంతకే వెళ్లి ఎస్పీ అజిత వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. భీమవరంలో 23, నరసాపురంలో 21 వినతులు వచ్చాయి. వీటిలో అధిక శాతం సివిల్, కుటుంబపరమైన వినతులు కాగా సంబంధిత స్టేషన్ పరిధిలోని సీఐ, ఎస్సైలతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రెండు వారాల వ్యవధిలో మద్యం, ఇసుక, పశువుల అక్రమ రవాణ, గంజాయి వ్యాపారులు, కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఎస్పీ అజిత ఉక్కుపాదం మోపారు. నేరస్తుల ఆటకట్టిస్తూనే మరో పక్క ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా సామాన్యులకు చేరువవుతున్నారు. వచ్చే సోమవారం తాడేపల్లిగూడెం సబ్‌డివిజన్ పరిధిలోని తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అర్జీదారులకు భోజన వసతి

పోలీసు స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు మధ్యాహ్న సమయంలో భోజన వసతి కల్పిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుంది. మధ్యాహ్న సమయంలో వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించడంతో పాటు దగ్గరుండి మరీ ఎస్పీ అజిత వేజెండ్ల వారికి భోజనం వడ్డించి పోలీసుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచుతున్నారు. స్పందన కార్యక్రమం అనంతరం సమీపంలోని పోలీస్, పోలింగ్ స్టేషన్లను పరిశీలించి సిబ్బందికి ఆమె సూచనలిస్తున్నారు.

మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా జహంగీర్



ఎండీ జహంగీర్

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉండికి చెందిన ఎండీ జహంగీర్ నియమితులయ్యారు. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం కేంద్ర కార్యాలయం ప్రకటించింది. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్‌కే. రబ్బాని (భీమవరం), షేక్ అబ్దుల్లా (ఆచంట), ప్రధాన కార్యదర్శులుగా ఏకే అహ్మద్ షరీఫ్ (ఉండి), ఎస్‌కే అబ్దుల్ ఖాదర్ జిలాని (తణుకు), ఎస్‌కే లియాఖత్ పాషా మొయినుద్దీన్ (తాడేపల్లిగూడెం), షేక్ నాగుర్ వలి (పాలకొల్లు), షేక్ నాగుర్ వలీ (పాలకొల్లు), కార్యదర్శులుగా షేక్ నాగూర్ మీరా సాహెబ్ (ఆచంట), ఎస్‌కే మెహబూబ్ (ఉండి), ఎస్‌కే ఇమామ్ (భీమవరం), ఎస్‌కే గౌస్ మోహిద్దీన్ (తణుకు), షాహిద్ ఖాన్ పఠాన్ (తాడేపల్లిగూడెం), షేక్ ఇబ్రహీం (పాలకొల్లు) నియమితులయ్యారు. అలాగే కార్యనిర్వాహక సభ్యులుగా షేక్ మస్తాన్ (ఆచంట), షేక్ ఖాదర్ వలీ (ఆచంట), ఎస్‌కే నాసిర్ (ఉండి), ఎస్‌కే షఫీ (ఉండి), ఎండీ మొహిద్దీన్ మీరా (ఉండి), ఎండీ సలీం ఖాన్ (భీమవరం), ఎండీ ఛాన్ బాషా (భీమవరం), ఎస్‌కే సత్తార్ (తణుకు), ఎస్‌కే మస్తాన్ (తణుకు), ఎండీ సిరాజుద్దీన్ (తాడేపల్లిగూడెం), ఎండీ అబ్దుల్ సిరాజ్ (తాడేపల్లిగూడెం), షేక్ ఖాదర్‌బాబ్ (పాలకొల్లు), షేక్ ఫక్రుద్దీన్ (పాలకొల్లు) నియమితులయ్యారు.

క్లుప్తంగా

ఆంతరంగిక కమిటీలను ఏర్పాటు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మహిళా ఉద్యోగులు పని చేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా ఆంతరంగిక కమిటీలను ఏర్పాటు చేయాలని, పది మంది మించి ఉద్యోగులు పని చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వట్లూరు టీటీడీసీ హాలులో శుక్రవారం మహిళా సాధికారత-మహిళా రక్షణ చట్టాలు అనే అంశం మీద అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు పనిప్రదేశాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే సంబంధిత కమిటీ ముందు ఫిర్యాదు చేయవచ్చని, ఆయా కమిటీలు ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచాలని తెలియజేశారు. పది మందిలోపు పనిచేస్తున్న కార్యాలయాల్లో మహిళలకు ఎలాంటి సమస్యలు ఎదురైన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఉంటుందని ఆ కమిటీ ముందు ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నేషనల్ ఉమెన్ కమిటీ ట్రైనీ బి.శ్రీలక్ష్మి, వెలుగు ప్రాజెక్టు మేనేజర్ అనిత పాల్గొన్నారు.

భీమవరంలో అభివృద్ధి పరుగులు

- 100 కోట్లతో వేగంగా పనులు
- 52.69 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు
- 117.98 కిలోమీటర్ల మేర డ్రెయిన్ల నిర్మాణం



కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో వేసిన సీసీ రోడ్డు



భీమవరం ఆర్టీసీ డిపో వద్ద వేసిన సీసీ రోడ్డు



31వ వార్డులో నిర్మించిన డ్రెయిన్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. గడిచిన 56 నెలల కాలంలో రూ.100 కోట్లుతో భీమవరం పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారు. మున్సిపల్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పిస్తున్నారు. పట్టణంలో రోడ్లు,డ్రెయినేజి సమస్యలు లేకుండా ఎక్కడ చూసిన అభివృద్ధి చేసిన రోడ్లు ఉండేలా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా పట్టణం మొత్తం 39 వార్డులు కాగా రూ.75.86 కోట్లతో ప్రతి వార్డులో నూతన సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మించారు. పట్టణంలో ఇప్పటి వరకు 52.69 కిలోమీటర్లు మేర సీసీ రోడ్లు నిర్మించారు. 117.98 కిలోమీటర్లు మేర డ్రెయినేజి నిర్మించారు. అలాగే నీటి సరఫరాకు సంబంధించి రూ.16.61 కోట్లుతో అభివృద్ధి పనులు చేశారు. అలాగే మరో రూ.7.53 కోట్లతో మరమ్మతులు ఇతర అభివృద్ధి పనులు చేశారు.

రూ.9 కోట్ల విలువైన పనులకు టెండర్లు

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశాలతో తాజాగా పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర పనులకు సంబంధించి రూ.9 కోట్ల పనులకు మున్సిపల్ అధికారులు టెండర్లును పిలిచారు. టెండర్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేసి పనులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు భీమవరం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ గ్రేడ్ 1 మున్సిపాలిటిలో జరగన అభివృద్ధిని చేసి చూపించారు.

గత ప్రభుత్వంలో పట్టణ అభివృద్ధి శూన్యం

గత టీడీపీ ప్రభుత్వంలో భీమవరం పట్టణ అభివృద్ధి 5 ఏళ్ల పాటు శూన్యంగా ఉంది. మున్సిపల్ చైర్మన్‌గా కొటికలపూడి చినబాబు, ఎమ్మెల్యేగా పులపర్తి అంజిబాబు పట్టణాన్ని అభివృద్ధికి చేసింది ఏమి లేదని పట్టణవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గత పాలనలో పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా ఉండేవి. అక్కడ అరకొర రోడ్లు వేయడం తప్ప పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించలేదు. దాంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్షాల నాయకులే గ్రంధి శ్రీనివాస్‌ను అభినందిస్తున్నారు. ఉదాహరణకు రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఇంటికి వెళ్లే రోడ్డు అధ్వానం ఉండేది. ఆ రోడ్డులో ఈ ప్రభుతంలోనే రూ.కోటి రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మించారు.

భీమవరం అభివృద్ధే లక్ష్యం



గెలిచిన నాటి నుంచి నేటి వరకు భీమవరం పట్టణం అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నాను. దాదాపు రూ 100 కోట్లుతో రోడ్లు,డ్రెయిన్లు, మంచినీటి సరఫరా పనులు చేయించాను. ఇప్పటికీ పలు అభివృద్ధి పనులు జరుగుతూనే ఉన్నాయి. భీమవరం పట్టణం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది. నన్ను నమ్మి గెలిపించిన పట్టణ ప్రజలకు మౌలిక వసతుల ఇబ్బందులు లేకుండా చూడాలని తపనతో కృషి చేస్తున్నాను.

– గ్రంధి శ్రీనివాస్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంకు వారి సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ సమస్త ద్వారా ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను వివిధ మండలాల్లో స్థాపిస్తున్నారు. భీమవరంలో కేంద్ర ప్రారంభ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకుల అందించే పొదుపు పథకాలు రుణ పథకాలు బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ వెంకన్నబాబు, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్టేట్ కో-ఆర్డినేటర్ కె.అశోక్, జి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

పరిపాలనలో తేడాను గమనించండి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలిలో కమ్యూనిటీ హాలు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ప్రజలు మనకు ఏ ప్రభుత్వ సమయంలో మంచి జరిగిందో? ఏ ప్రభుత్వం సాయం చేస్తుందో?గమనించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. అత్తిలి మండలంలో పలు గ్రామాల్లో రూ. 12.77 కోట్లతో చేపట్టిన గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ భవనాలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించి, సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య పరిపాలనలో తేడా గమనించాలని జగనన్న ప్రభుత్వం పేదలకు సాయం చేసే ప్రభుత్వమని స్పష్టం చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పేదలకు చెందాల్సిన డబ్బును పందికొక్కుల్లా దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ల ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమపాలన కొనసాగుతుందని, లేకపోతే మళ్లీ ప్రజా ధనాన్ని దోచుకునే పాలకులు వస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఖోఖో పురుషుల జట్టుకు ఎంపిక



56వ సీనియర్ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొనే పురుషుల జట్టు

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ పురుషుల ఖోఖో జట్టు ఎంపిక చేశామని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.సాంబశివరావు, ఎస్‌వీ రంగారావు తెలిపారు. శుక్రవారం గంగన్నగూడెంలో వారు మాట్లాడుతూ లింగపాలెం మండలం కె.గోకవరం జిల్లా పరిషత్ హైస్కూలో జరిగిన పోటీల్లో 40 మంది క్రీడాకారులు పాల్గొనగా జిల్లా జట్టుకు 15 మంది ఎంపిక చేశామని అన్నారు. ఈ నెల 24 నుంచి 26 వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో జరిగే 56వ సీనియర్ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశవ అప్పారావు

ఏలూరు (టూటౌన్): బాలల హక్కులను, చట్టాలను పరిరక్షించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశవ అప్పారావు. ఏలూరులోని ఆదిత్య ప్రిన్స్ రెస్టారెంట్‌లో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్,చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, విజయవాడ వారి ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ అధికారి కేఏవీఎల్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేశవ అప్పారావు మాట్లాడుతూ అధికారులు బాలల విషయంలో సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రతి ఒక్క అధికారి బాలల విషయాల్లో అవలంబించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన చర్యలను గురించి తెలియజేశారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్ర ప్రసాద్, టి.ఆదిలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీఎస్ సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు తెలిపారు. దొంగపిండి గ్రామానికి చెందిన ఓ యువతి (21) భీమవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 14న కళాశాలకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు ఇంటి వద్ద వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో యువతి తండ్రి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు.

ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా శ్రీనివాసమూర్తి



శ్రీనివాసమూర్తికి అభినందనలు చెబుతున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సి.శ్రీనివాసమూర్తి శుక్రవారం కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఈపీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా చేరిన శ్రీనివాసమూర్తి వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ సీజీఎం హోదాలో 2023లో పదవీ విరమణ చేశారు. ఐటీ విభాగంలో విధులు నిర్వర్తించిన సమయంలో ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, మైఈపీ, ఆన్లైన్ పేమెంట్, వాట్సాప్ ఆటోమేటెడ్ చాట్ తదితర ఐటీ ఆధారిత సేవలను రూపొందించారు. డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సమగ్ర మౌలిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా ఇళ్లకు, వీధి దీపాలకు, వాటర్ వర్క్‌లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తిని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్ అభినందించారు.

వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా కమిటీ నియామకం



బుడితి సుమన్‌కుమార్

సాక్షి, భీమవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడిగా నరసాపురానికి చెందిన బుడితి సుమన్‌కుమార్ నియమితులయ్యారు. సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు 36 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఉపాధ్యక్షుడిగా ఈదా యోహోషువా (ఉండి), యర్రా జ్యోతి లక్ష్మి స్వరూప్ (భీమవరం), బొడ్డు ఆమోస్ (తణుకు), కలిదిండి రవితేజ (నరసాపురం), ప్రధాన కార్యదర్శులుగా మామన్న జోనం అజలహ్, సుందర్‌రావు చింతాడ (తాడేపల్లిగూడెం), పకనాటి తాతాజీ (తాడేపల్లిగూడెం), పాలపర్తి లూథర్ (భీమవరం), కొత్తపల్లి చరణ్‌కుమార్ (తణుకు), రోనంకి శ్రీనివాస్ (పాలకొల్లు), చిన్నం రామకృష్ణా రెడ్డి (ఆచంట), బొమ్మ రామకృష్ణ (నరసాపురం), కార్యదర్శులుగా షాజిద్ మహ్మద్ (ఉండి), మల్లిపూడి రిచియ్ జోహాన్నాస్ (ఉండి), జలాది కాటం (తాడేపల్లిగూడెం), ముత్యాల కేశవ్ (భీమవరం), ముద్దాల రవికాంత్ (తణుకు), గంధం రాజేంద్ర (పాలకొల్లు), దిడ్ల రంజిత్ (పాలకొల్లు), వాసంశెట్టి బుచ్చిబాబు (ఆచంట), పడాల నాగవెంకట సతీష్‌కుమార్‌రెడ్డి (ఆచంట), దీకల దివాకర్ (నరసాపురం), సంయుక్త కార్యదర్శులుగా పెనుమాల రిచియ్ జాన్‌కేట్స్ (ఉండి), లోకవరాజు వెంకటశ్రీనివాస్ (ఉండి), పెందుర్తి జీవన్‌కుమార్ (తాడేపల్లిగూడెం), జలాది సురేష్ కుమార్ (తాడేపల్లిగూడెం), కోడి ప్రవీణ్ (భీమవరం), తిరుమాని దుర్గారాజు (భీమవరం), గిరి రామారెడ్డి (తణుకు), ఆర్‌వీ రామారావు (తణుకు), బుంగా పవన్‌కుమార్ (పాలకొల్లు), దిడ్డే కిషోర్‌బాబు (ఆచంట), కర్రి శివశంకర్‌రెడ్డి (ఆచంట), దీపాటి మూర్తిరాజు (నరసాపురం), యేలూరి అనిల్ (నరసాపురం) తదితరులు నియమితులయ్యారు.

శోభనాచల క్షేత్రంలో రథసప్తమి సందడి






ఆగిరిపల్లి లో శోభనాచలుని దర్శనం కోసం క్యూ లైన్ లో వేచి ఉన్న భక్తులు, ప్రత్యేకాలంకరణలో గోదాదేవి, రాజ్యలక్ష్మి సమేత శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి

ఆగిరిపల్లి: జిల్లాలోని ప్రసిద్ధ శివ కేశవుల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయానికి మాఘమాస రథసప్తమి, శాంతి కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం పోటెత్తారు. నూజివీడు మున్సిపల్ చైర్మన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్, స్వామివారిని దర్శించుకున్నారు. అదే విధంగా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ బాల సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సిపి జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఎస్సై సురేంద్ర కుమార్ ప్రారంభించారు. భారీ ఎత్తున నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 25 వేల మంది భక్తులు హాజరయ్యారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శోభనాచలుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కొండపైన మూడు గుళ్ళ వద్ద వెలిసిన వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామిని దాని పై కొండన వెలిసిన దుర్గా మల్లేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి ఎక్కారు. ఈ సందర్భంగా భక్తులు దిగువన ఉన్న స్వామివారి కోవెల నుంచి కొండపై వరకు మెట్లకు పసుపు, కుంకుమలతో మెట్ల పూజ నిర్వహించారు. ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 11 గంటలకు గంటలకు వట్టి గుడిపాడుకు చెందిన చింతపట్ల వెంకట సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో శాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

నేడు శోభనాచలుని దివ్య రథోత్సవం

రథసప్తమి ఉత్సవంలో భాగంగా శనివారం స్వామి వారి దివ్య రథోత్సవం జరగనుంది. ఉత్సవంలో ప్రధాన భాగమైన పెద్ద రథాన్నిసుందరంగా ముస్తాబు చేశారు. శోభాయమానంగా రంగులతో అలంకరించి ఉత్సవానికి సిద్ధం చేశారు.

సీఎం జగన్ రైతుల పక్షపాతి



కొత్తపట్టిసీమ రాచగట్టు చెరువు కల్వర్టును ప్రారంభిస్తున్న కారుమూరి సునీల్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పాత పట్టిసీమ గ్రామంలో రైతులకు అవసరమైన సొసైటీ గోడౌన్‌ను రూ. 38లక్షలతో నిర్మించారు. ఈ భవనాన్ని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్‌లు ప్రారంభించారు. అలాగే పట్టిసం శివక్షేత్రం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. కొత్తపట్టిసీమ గ్రామంలో కొవ్వాడ కాలువ రాచగట్టుచెరువు వద్ద రూ. 41 లక్షలతో కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణాలను ప్రారంభించారు. గూటాలలో రూ. 33లక్షలతో నిర్మించిన సొసైటీ గోడౌన్‌ను, రూ. 21.80లక్షలతో నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గూటాలలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాక, ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు సకాలంలో సొమ్ములు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్‌లు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమను గెలిపించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రజలకు అందించే పథకాలన్నీ సక్రమంగా అందించేలా కృషి చేస్తామన్నారు.

వలంటీర్లకు సత్కారం

పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్ల సేవను గుర్తించి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర సర్టిఫికెట్లను అందజేశారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ కారుమూరి సునీల్‌కుమార్‌లు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, సుంకర అంజిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీశైలం మల్లికార్జునస్వామి తలపాగాను దర్శించిన భక్తులు



మల్లికార్జునస్వామి తలపాగాను దర్శించుకుంటున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీశైలం మల్లికార్జున స్వామి ధరించే తలపాగాను పట్టణంలోని సత్యవతినగర్‌లో కుందుం వెంకటేశ్వరరావు నివాసంలో ఉంచారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, ఆరేపల్లి ఉమామహేశ్వరరావు, జామి సత్యనారాయణ, అల్లక పుల్లారావు, శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి విరాళాలు



వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.1.75లక్షలు విరాళం అందజేస్తున్న ముత్తా శ్రీరామమూర్తి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన ముత్తా శ్రీరామమూర్తి – సీతనాగమణి దంపతులు రూ.1.75లక్షలు విరాళాన్ని శుక్రవారం ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులకు అందజేశారు. అలాగే ఆర్.వెంకటస్వామి – ఉమాదేవి దంపతులు రూ.20వేలు విరాళాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా వారికి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా కలగాలని ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులు ఆకాంక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ స్టేషన్ సందర్శించిన తహసీల్దార్ సురేష్ బాబు, తదితరులు

పెంటపాడు: మండలంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను శుక్రవారం పెంటపాడు తహసీల్దార్ సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. మీనవిల్లూరు, కోరిమిల్లి, పరిమెళ్ల, యానాలపల్లి, కె. పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు తదితర పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌ల్లో ఓటర్ లిస్టులను కూడా పరిశీలించారు. ఆర్ఐ కనకదుర్గ, ఏఎస్‌వో భార్గవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

20న ఆదర్శ్ సోషల్ సర్వీస్ కార్యాలయం ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సామాజిక సేవలు ప్రజలకు అందించే విధంగా నిర్వహిస్తున్న ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయం ఈ నెల 20వ తేదీన పట్టణంలో ప్రారంభిస్తున్నట్లు అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి తెలిపారు. కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభిస్తారని, యువ నేత విశాల్, ఆర్డీవో చెన్నయ్య, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, పట్టణ ప్రముఖులు హాజరవుతారని, విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌కు ద్వితీయ బహుమతి

భీమవరం: హైదరాబాద్ వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయిలో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(ఐడీఈ) కాంపిటేషన్‌లో భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎస్.గోపాలకృష్ణమూర్తి, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, బీఆర్‌కే వర్మ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: వాదించుకుంటే ఎవరో ఒక్కరే గెలుస్తారని, సమస్యను పరిష్కరించుకుంటే ఇరువురికీ ఆమోదయోగ్యమైన తీర్పు పొందవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కోర్టు హాలులో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మార్చి 9న ఉదయం 10 గంటల నుంచి స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు.

చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి చేశాం

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చరిత్రలో నిలిచిపోయేలా తణుకు నియోజవర్గాన్ని అభివృద్ధి చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలంలో పలు గ్రామాల్లో రూ. 12.77 కోట్లతో చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ భవనాలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించి, సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సత్వర పౌర సేవలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేశారన్నారు. మనకు ఏ ప్రభుత్వ సమయంలో మంచి జరిగిందో, ఏ ప్రభుత్వం సాయం చేస్తుందో కూడా ప్రజలు గమనించాలని సూచించారు.



అత్తిలి మండలం గుమ్మంపాడులో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరావు

అత్తిలి మండలంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఇవే

అత్తిలి మండలం వరిఘేడులో రూ.34 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును మంత్రి కారుమూరి నాగేశ్వరావు ప్రారంభించి, రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గుమ్మంపాడులో రూ.20.08 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రూ.5 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ భవనం, రూ.30 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను ప్రారంభించి, రూ.7 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. బల్లిపాడులో రూ.55.60 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకుకు ప్రారంభోత్సవం చేసి, రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. అత్తిలిలో రూ.43.60 లక్షలతో నిర్మించిన అత్తిలి-4 గ్రామ సచివాలయం, రామన్నపేటలో రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు భవనం, రూ.43.60 లక్షలతో నిర్మించిన అత్తిలి-3 సచివాలయం, రూ.20.08 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, జలజీవన్ మిషన్ పథకంలో రూ.4.51 కోట్లతో చేపట్టిన పైపులైన్ విస్తరణ, మంచినీటి శుద్ధి ప్లాంట్, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అత్తిలి రామన్నపేటలో రూ.5.90 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బి.బి.ప్రసాద్, ఎంపీపీ ఎం.సూర్యనారాయణ, జెడ్పీటీసీ ఎ.జానకి, పార్టీ మండల అధ్యక్షుడు పి.సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు, తహసీల్దార్ ఎ తాతారావు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

కేంద్రానికి తగిన గుణపాఠం చెప్పాలి



జగన్నాథపురం గ్రామంలో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దూకుడుగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను మారుస్తుందని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ విమర్శించారు. రైతు సంఘాల సంయుక్త సమితి, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో ఒక్క పరిశ్రమ కూడా పెట్టకుండా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణకు పూనుకుంటుందని దుయ్యబట్టారు. మెంచాల సత్తిపండు, తులా దుర్గారావు, నీలం సత్తిబాబు,ప్రసాద్‌రెడ్డి, శ్యామ్, టి.ఏసు పాల్గొన్నారు.

మీ అభివృద్ధిని చూసే ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు

ప్రతిపక్ష పార్టీలను నమ్మే పరిస్థితిలో తణుకు ప్రజలు లేరు

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తణుకులో జరిగిన అభివృద్ధి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని, టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఎన్ని అవాస్తవాలు మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో మీరు చేసిన అభివృద్ధిని చూసే తణుకులో ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టిన విషయం మరచిపోవద్దని గుర్తుచేశారు. మా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రభుత్వం నుంచి తీసుకువచ్చిన నిధులతో చేసిన అభివృద్ధిని ఆధారాలతో సహా ఫ్లెక్సీల రూపంలో బహిరంగంగానే చూపించామని మీతో చర్చలు చేయాల్సిన అవసరం మంత్రి కారుమూరికి లేదని స్పష్టం చేశారు. మా ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిన సంక్షేమానికి భయపడి మీరు 175 స్థానాల్లో సింగిల్‌గా పోటీచేసే ధైర్యం లేక మీపార్టీ పొత్తులతో ఎన్నికలకు వెళ్తున్నారనే విషయాన్ని మననం చేసుకుని మాట్లాడాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు

ఫ్లెక్సీలపై రాజకీయమా...

తణుకు నరేంద్ర సెంటర్ ఐలాండ్‌లో ఉన్న భారీ ఫ్లెక్సీల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మలుపుల్లో వాహనాలను గుర్తించలేని పరిస్థితుల రీత్యా పోలీసులు, మునిసిపల్ అధికారులు ఫ్లెక్సీలను తొలగింపు చేస్తుంటే దానిని కూడా రాజకీయం చేస్తారా అని చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు నిలదీశారు. గురువారం రాత్రి ముందుగా మంత్రి కారుమూరి కటౌట్‌నే మునిసిపల్ సిబ్బంది తొలగించారని ఆ తరువాతే టీడీపీకి చెందిన భారీ ఫ్లెక్సీలు తొలగిస్తుండగా మీరు చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదని విమర్శించారు. అక్కడితో వదిలేయకుండా శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో అధికారుల విధులకు ఆటంకం కలిగే విధంగా కార్యాలయ గదుల్లో బైఠాయించి నిరసన తెలపడం ఎంతవరకు సబబన్నారు. ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, బాబూరావు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి



వినతిపత్రం తీసుకుంటున్న గట్టిం మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్‌దేశాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని గల్ఫ్ హెల్ప్ నిర్వాహకులు, కైండ్‌నెస్ అధ్యక్షులు, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం గల్ఫ్‌హెల్ప్ కార్యక్రమం గట్టిం అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ గల్ఫ్ దేశాలలో ఇబ్బందులు పడుతున్న వారికి సాయం అందజేసేందుకు తన వంతు సహాయ సహకారాలు తప్పక ఉంటాయని చెప్పారు. గల్ఫ్ దేశాలలో ఇబ్బందులు పడుతున్న కుటుంబ సభ్యుల నుంచి వినతులు స్వీకరించారు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన గౌరీ జీవనోపాధి కోసం మస్కట్ దేశానికి వెళ్లగా అక్కడ ఆమె అనారోగ్యానికి గురైంది. అంతేగాక అనేక ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న ఆమె భర్త అప్పారావుకు ఏమి చేయాలో తెలియని పరిస్థితులో గల్ఫ్‌దేశాలలో ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం అందజేసే గల్ఫ్‌హెల్ప్ కార్యక్రమానికి హాజరై గట్టిం మాణిక్యాలరావును కలిసి తన భార్య గౌరీని రక్షించి ఇండియాకు తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మస్కట్‌లో ఇబ్బందులు పడుతున్న గౌరీని ఇండియాకు రప్పించేందుకు కృషి చేస్తానని గట్టిం హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



అత్తిలి మండలం వరిఘేడులో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



అత్తిలి శివారు రామన్నపేటలో వైఎస్సార్‌సీపీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి



అత్తిలి మండలం గోగులమ్మపేటలో మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు కార్యకర్తలు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం వరిఘేడు, గుమ్మంపాడు, బల్లిపాడు, అత్తిలి గోగులమ్మపేట, అత్తిలి రామన్నపేట, సంత మార్కెట్ సెంటర్ నుంచి శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో పెద్దసంఖ్యలో జనసేన, టీడీపీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఘన విజయానికి కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అద్దాల జానకి, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల పండుస్వామి, తోట వెంకటేశ్వరరావు, తలారి శ్రీనివాస్, గుబ్బల ఆంజనేయులు, ధనుమూరి తాతాజీ, సొసైటీ అధ్యక్షులు కునాధరాజు శ్రీహరిరాజు, ఆకుల చినబాబు, దారాబత్తుల రామాంజనేయులు, సుంకర నాగేశ్వరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో రథసప్తమి వేడుకలు



అత్తిలిలో సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: రథసప్తమి సందర్భంగా అత్తిలి శ్రీఉమా సిద్ధేశ్వర స్వామి ఆలయంలో గల శ్రీసూర్యనారాయణస్వామిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో మంత్రి కారుమూరికి స్వాగతం పలికారు. ముందుగా శ్రీఉమాసిద్దేశ్వరస్వామివారిని, అనంతరం సూర్యనారాయణస్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న సూర్యనారా యణస్వామివారి కల్యాణాన్ని మంత్రి తిలకించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అద్దాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, మద్దాల శ్రీనివాస్, పోలనాటి చంద్రరావు, కంకటాల సతీష్, రామిశెట్టి రాము, గంటా నాగరాజు, రంభ రాంబాబు, సబ్బితి రాజేష్, బుడితి సుజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవిలో సూర్యనారాయణ స్వామికి కల్యాణోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘ మాసం, రథ సప్తమి సందర్భంగా స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో సూర్యనారా యణ స్వామికి వైభవంగా కల్యాణోత్సవం, శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, తరుణ్‌శర్మ బ్రహ్మత్వంలో మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాలా త్రిపుర సుందరరావు, ఆలయ సెక్రటరీ ఆలపాటి సత్యనారాయణలు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

పెంటపాడు: మండలంలోని రావిపాడు సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పడాల నర్సయ్య ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అనంతరం సుమారు 5వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో వంగూరి వెంకట సుబ్బారావు, కాజులూరి దుర్గామల్లేశ్వరరావు, అయితం శ్రీనివాస్, శివనాగేశ్వరరావు, జానే వెంకట తాతాజీ, వంగూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు



అత్తిలి: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్



తణుకు టౌన్: వేల్పూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్యులు

అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ గంటావిజేత అన్నారు. శుక్రవారం అత్తిలి-2 సచివాలయం వద్ద 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యశిబిరంలో 274మందికి సాధారణ పరీక్షలు, 63 మందికి ఆర్థోపెడిక్, 64మందికి గైనిక్ సేవలు, 15మందికి కంటి పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 2వ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంటా నాగరాజు, సీహెచ్ఓ పి మురళి, హెచ్‌వీ పి అమ్మాజీ, ఎంపీహెచ్ఎస్ జెఎస్ గనిరాజు, హెచ్ఎస్ వెంకట్రావు, భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

తణుకు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్‌డీ ఏఎస్ కోటేశ్వరరావు తెలిపారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు 3వ సచివాలయం వద్ద నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 361 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం వేల్పూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో సచివాలయ పరిధిలోని కుటుంబాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ వైద్య పరీక్షలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు సిఫార్సు చేయడం జరిగిందని చెప్పారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చుండ్రు శ్యామల, వైద్యులు డాక్టర్ కే కీర్తి, డాక్టర్ డీ రమేష్, డాక్టర్ వై సహిత, డాక్టర్ సాయి భవాని వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కావలిపురంలో జగనన్న ఆరోగ్యసురక్ష

ఇరగవరం: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం కావలిపురం గ్రామంలో ఎంపీయూపీ స్కూల్‌లో 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 368 రోగులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పున్నం వెంకటలక్ష్మి, సర్పంచ్ వనంచర్ల అప్పన్నస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీడీవో కె పద్మ, వైద్యులు డాక్టర్ నిమ్మల సత్యనారాయణ, డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ సాయిగిరిరెడ్డి, డాక్టర్ శ్రీనివాసుబాబు, కార్యదర్శి టి దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పీఎంకే జ్యోతి

తాడేపల్లిగూడెం (టీఓసీ):పాఠశాల స్థాయి నుంచే విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు సులభంగా లభిస్తాయని మండల విద్యాశాఖ అధికారి పి.ఎం.కె. జ్యోతి అన్నారు. ఇటీవల అపుస్మా ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలలకు నిర్వహించబడిన జోన్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ హాల్లో ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఓ జ్యోతి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడాపోటీలకు ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమన్నారు. క్రీడా పోటీల్లో కృషి, పట్టుదలతో పాల్గొంటే శారీరక, మానసిక ధృఢత్వం లభిస్తుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడితో ఉండే విద్యార్థులకు రోజుకు 2 గంటల పాటు యోగా, వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటే జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఎంచుకున్న క్రీడల్లో విజయం సాధిస్తే ప్రతి విద్యార్థి స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు సులభతరంగా సాధించవచ్చని సూచించారు. అనంతరం ఎంఇఓ జ్యోతి ని అపుస్మా నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రీజినల్ అధ్యక్షుడు కింబర్లి బాలాజీ, జిల్లా కార్యదర్శి అత్తింటి సుబ్బారాజు, జోన్ అధ్యక్షుడు వాకలపూడి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పచ్చిపాల శివశంకర్, కోశాధికారి గుణ్ణం చిరంజీవి, ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి, రాజేష్, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.